నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, ఆదివారం 21 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM



దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి-ప్రగళ్లపల్లి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం

# ముంచెత్తిన వాన

- పొంగుతున్న కిన్నెరసాని, తాలిపేరు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో రాకపోకలకు అంతరాయం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ జితేశ్ పాటిల్



భద్రాచలం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (నమస్తే తెలంగాణ) : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరిలో వరద క్రమేపీ పెరుగుతున్నది. కిన్నెరసానిలో భారీగా వరద చేరడంతో 15 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.45 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం గేట్లు ఓపెన్ చేయడంతో దిగువ భాగంలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. గుంపల్లి- చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతమ్మ నారచీరెల ప్రదేశం నీట మునిగింది.



పెదనల్లబల్లి- లక్ష్మీపురం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరద

**రాకపోకలకు అంతరాయం..**

భారీ వర్షాల కారణంగా భద్రాచలం డివిజన్ పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి వాగు పొంగి ప్రవహించడంతో కే లక్ష్మీపురం-పెదనల్లబల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దిగువన ఉన్న గ్రామాలు సంగ్యం, నల్లబల్లి, గౌరారం, పైడిగూడెం, తాటివారిగూడెం, సంజనాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సీతమ్మవాగు పొంగడంతో పర్ణశాల వద్ద దుకాణాలు కూడా నీటమునిగాయి.

**పెరుగుతున్న గోదావరి..**

ఎగువన కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతున్నది. ఉదయం నుంచి గంటకు అడుగు చొప్పున పెరుగుతూ వస్తున్నది. రాత్రి 8 గంటలకు 35.50 అడుగులకు చేరింది. ప్రస్తుతానికి ఎలాంటి ముప్పు లేకపోయినప్పటికీ రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**అంతటా మోస్తరు వాన..**

జిల్లా అంతటా మోస్తరు వాన కురిసింది. అత్యధికంగా లక్ష్మీదేవిపల్లిలో 37 మిల్లీమీటర్లు, దమ్మపేట మండలం మందలపల్లిలో 12 మిల్లీమీటర్లు, మల్కారం 11 మిల్లీమీటర్లు, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, భద్రాచలం, జూలూరుపాడు, పాల్వంచ, బూర్గంపాడు, గుండాల, సుజాతనగర్, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో 10 నుంచి 7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పైన కురిసిన వర్షాలకే ఇక్కడ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.




తాలిపేరు గేట్లద్వారా నీరు విడుదల



పర్ణశాల: పెద్ద గుబ్బలమంగి వాగు పొంగడంతో దరంపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

- నగరంలో జలమయమైన రహదారులు
- చెరువులు, కుంటలకు పెరుగుతున్న వరద ఉధృతి
- సత్తుపల్లి ఓపెన్ కాస్టులో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- సాగు పనుల్లో నిమగ్నమైన జిల్లా రైతాంగం

## ఖమ్మంలోనూ..



సత్తుపల్లి : నిండుకుండలా తొణికిసలాడుతున్న బేతుపల్లి చెరువు

ఖమ్మం వ్యవసాయం, జూలై 20 : జిల్లావ్యాప్తంగా శనివారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. కల్వర్టులు పొంగి వ్యర్థపు నీరు రోడ్లపై ప్రవహించింది. వర్షం ఎంతకూ తెరిపివ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సాయంత్రం కొంత ఒరుపివ్వడంతో రోడ్లపై జనసంచారం కనిపించింది. సత్తుపల్లి, మధిర, పాలేరు, వైరా నియోజకవర్గాల్లో కూడా భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో పత్తి, మొక్కజొన్న, ఇతర అపరాల పంటల సాగు పనులు జోరందుకున్నాయి. ప్రస్తుత వర్షాలతో అన్నదాతలు పొలాలు దమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే వరి నారుమడులు పోసుకున్న రైతులకు ప్రస్తుత వర్షం ఊరటనిచ్చినట్లైంది. నిన్న మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలబోయిన మున్నేరు వాగు కొత్త నీటితో జలకళను సంతరించుకుంది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు పూర్తిగా నిండి అలుగుపోసింది. వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. గత ఏడాది నుంచి నీటి నిల్వలు లేక ఎండిపోయిన అనేక చెరువులు, కుంటలకు వరద నీరు వచ్చి చేరుతోంది. పాలేరు, వైరా రిజర్వాయర్‌లకు వరద నీరు వచ్చి చేరుతోంది. సత్తుపల్లిలోని ఓపెన్ కాస్టులో వరదలతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.

### జిల్లాలో వర్షపాతం నమోదు వివరాలు ఇలా..

గడిచిన 24 గంటల్లో(శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు) జిల్లావ్యాప్తంగా 49.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేంసూరు మండలంలో 79.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కామేపల్లి 76 మి.మీ, సింగరేణి 68.8 మి.మీ, పెనుబల్లి 62.2 మి.మీ, తిరుమలాయపాలెం 54 మి.మీ, చింతకాని 51.8 మి.మీ, కల్లూరు 58 మి.మీ, సత్తుపల్లి 61.6 మి.మీ, మధిర 55 మి.మీ, తల్లాడ 48 మి.మీ, ఖమ్మం అర్బన్ 46 మి.మీ, రఘునాథపాలెం 45.2 మి.మీ, ఖమ్మం రూరల్ 48.2 మి.మీ, ముదిగొండ 42.4 మి.మీ, వైరా 44.4 మి.మీ, ఇతర మండలాల్లో మరో 30-40 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. 6-12 సెంటీ మీటర్ల వర్షపాతం 3 మండలాల్లో నమోదు కాగా.. 3-6 సెంటీ మీటర్ల వర్షపాతం మరో 10 మండలాల్లో నమోదైంది.


### పొంగుతున్న బేతుపల్లి..

**లంకాసాగర్‌కు కొనసాగుతున్న వరద**

సత్తుపల్లి/పెనుబల్లి, జూలై 20 : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. కల్లూరు డివిజన్‌లో భారీ వర్షపాతం నమోదుకాగా.. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు పూర్తిస్థాయిలో నిండి పొంగి పొర్లుతోంది. వరి పొలాల్లోకి నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు సింగరేణి జీవీఆర్ ఓసీలో 30 వేల టన్నుల బొగ్గు, 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు వెలికితీతకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సింగరేణి బొగ్గు గనులు నిర్మానుష్యంగా మారాయి. బొగ్గు గనుల్లో నీటిని వెలికి తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ మధ్యతరహా ప్రాజెక్టుకు వరద నీరు ఉధృతంగా చేరుతోంది. దీంతో అలుగు పైకి నీరు పొర్లుతూ పారుతోంది. దూర ప్రాంతాల నుంచి పొలాల్లోకి చేరిన వరద ప్రాజెక్టులోకి చేరడంతో కనుచూపు మేర నీటి ప్రవాహం ఆహ్లాదంగా కనిపిస్తోంది. ఆయా గ్రామాల ప్రజలు ప్రాజెక్టును చూసేందుకు తరలివస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రాజెక్టు వద్ద ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ తగు సూచనలు సలహాలు చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు వరద నీరు కొనసాగితే ప్రాజెక్టు నుంచి నీరు తూముల ద్వారా ఎత్తే అవకాశం ఉంది.

### ఊపందుకున్న సాగు పనులు

విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే అపరాలు, వాణిజ్య పంటల సాగు పనులు ప్రారంభం కాగా, ప్రస్తుత వర్షాలతో వరినాట్లు ముమ్మరమయ్యాయి. జిల్లా వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా శనివారం వరకు 2,87 336 ఎకరాల్లో సాగు పనులు చేపట్టారు. పంటలవారీగా పరిశీలిస్తే.. పత్తి సాగు 1,84 857 ఎకరాలు, వరి 51,771 ఎకరాలు, కంది 236 ఎకరాలు, మక్క 1,572 ఎకరాలు, పెసర 13,250 ఎకరాలు, పచ్చరొట్ట సాగు మరో 32 వేల ఎకరాల్లో సాగు చేశారు.



సత్తుపల్లి : జేవీఆర్ఓసీలో నిలిచిన నీరు



బ్రాహ్మలకుంటలో పొలాల్లో పారుతున్న వరద



మధిరలోని శివాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా నది

## ఆ ఐదు పంచాయతీలు..

# ఆగమాగం

- అశ్వారావుపేట మండలంలో వరుణుడి ప్రతాపం
- రూపం మారిన పెదవాగు ప్రాజెక్టు
- గత ప్రభుత్వ రూ.కోటీ 20లక్షల నిధులు నీటిపాలు
- ఈ ఏడాది పంటలు ప్రశ్నార్థకమే..?
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



కావడిగుండ్ల-కన్నాయిగూడెం రహదారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి పైకప్పు

అశ్వారావుపేట రూరల్, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అశ్వారావుపేట మండలం ఆగం.. ఆగం అయ్యింది. వరుణుడి ప్రతాపంతో ముఖ్యంగా గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, రంగాపురం, అనంతారం, నారాయణపురం గ్రామ పంచాయతీల్లోని రైతన్నలకు కొండంత శోకం మిగిలింది. వేలాది మంది రైతన్నల కడుపు నింపే వరప్రదాయిని, అన్నపూర్ణ లాంటి పెదవాగు ప్రాజెక్టు రూపమే మారిపోయింది. ఇటీవలే ప్రాజెక్టు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.కోటీ 20లక్షల నిధులు నీటిపాలయ్యాయి. ఎటుచూసినా పత్తి, వరి, కూరగాయలు, పామాయిల్ వంటి పంటలు ఇసుక మేటలతో దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ క్షేత్రాలకు రైతన్నలు వేసుకున్న విద్యుత్ స్తంభాలు ముక్కలు ముక్కలుగా విరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు వరదకు కొట్టుకుపోయాయి. పలు చెరువులకు గండ్లు పడ్డాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు ఛిద్రంగా మారాయి.. పలుచోట్ల గండ్లు పడ్డాయి. మూగజీవాలు కొట్టుకుపోయాయి. ప్రజలంతా మూడో రోజు కూడా అంధకారంలోనే మగ్గుతున్నారు. పారిశుధ్యం పడకేయడంతో రోగాల బారినపడతామనే ఆందోళన చెందుతున్నారు

**అన్నదాతల ఆందోళన..**

పెదవాగు ప్రాజెక్టు 3 కిలోమీటర్లు ఆనకట్ట పొడవు కలిగి ఉంది. ఈ ఆనకట్టకు మూడు చోట్ల గండ్లు పండి నీరంతా బయటకు వెళ్లిపోవడంతో ఆయకట్టు రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇన్నాళ్లు తమ కడుపు నింపిన వరప్రదాయిని మళ్లీ తిరిగి అన్నం పెడుతుందా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ ప్రాజెక్టు కేంద్ర జలవనరుల శాఖ పర్యవేక్షణలో ఉండి ఆంధ్రప్రదేశ్ 80 శాతం, తెలంగాణ 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టు కనుక ఇరు ముఖ్యమంత్రులు సమన్వయంతో పనిచేసి ఆధునీకరణ పనుల కోసం నిధులు కేటాయిస్తారా.. అని ఆందోళన చెందుతున్నారు. కాగా.. గతంలో రైతులపై మమకారంతో మాజీ సీఎం కేసీఆర్ గేట్ల ఆధునికీకరణ కోసం రూ.కోటి 20లక్షల నిధులు మంజూరు చేశారు.

**ఈ ఏడాది పంటలు ప్రశ్నార్థకమే..?**

గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురం గ్రామాల్లోని రైతులు వరినాట్లు వేసేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఈలోపే వరదల కారణంగా భూముల్లో ఇసుకమేటలు వేశాయి. దీంతో ఈ ఏడాది బీడు భూములుగా మిగులుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుకను తొలగించటం, గుంతలను పూడ్చటం వంటి పనులు చేపడితే ఎకరానికి రూ.50 వేల నుంచి లక్షకు పైగా ఖర్చు అవుతుందని, దీనికి ప్రభుత్వం సాయం అందించాలని వేడుకుంటున్నారు.





గుమ్మడవల్లిలో ఇసుకమేట వేసిన ఆయిల్‌పాం తోట



దిమ్మపై నుంచి పడిన ట్రాన్స్‌ఫార్మర్

గాండ్లగూడెం-నారాయణపురం వద్ద కొట్టుకుపోయిన రహదారి

### ఆ ఐదు పంచాయతీలపై వరుణుడి పగ

మండలంలోని ఆ ఐదు గ్రామ పంచాయతీల్లోని ప్రజలపై వరుణుడు పగబట్టినట్లు కనిపిస్తున్నది. గుమ్మడవల్లి పంచాయతీలోని కొత్తూ రు, చిచ్చోడిగుంపు, నారాయణపురం జీపీలో ఖమ్మంపాడు, జగన్నాథపురం గ్రామాలు, రంగాపురంలో కోయరంగాపురం, వడ్డెరరంగాపురం, మేకలబండ గ్రామాలు, బచ్చువారిగూడెంలో జెట్టివారిగూడెం, ఆశివారిగూడెం గ్రా మాలు అనంతారం గ్రామ పంచాయతీల్లోని రైతులకు అపారం నష్టం వాటిల్లింది. అదేవిధంగా కావడిగుండ్ల-కన్నాయిగూడెం గ్రామాల మధ్య బ్రిడ్జి పై కప్పులేచి వాగులో పడింది. గాండ్లగూడెం-నారాయణపురం గ్రామాల మధ్య పెద్దవాగు బ్రిడ్జి దగ్గర, బచ్చువారిగూడెం చెరువుకు గండి పడడం వల్ల గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మల్లాయిగూడెం సమీపంలో ఇటీవల నిర్మించిన రహదారి, గుమ్మడవల్లి -రంగాపురం గ్రామాల మధ్యన నిర్మించిన బ్రిడ్జి దగ్గర మట్టి కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మూడు దుక్కుటెద్దులు మృతి చెందాయి. జగన్నాథపురంలో గొర్రెలు, మేకలు 20 శాల్తీలకు పైగా మృతిచెందాయి. శనివారం కూడా మండలంలో వర్షం ఎడతెరిపిలేకుండా కురిసింది.



గుమ్మడవల్లిలో మృత్యువాతపడిన దుక్కిటెద్దు

# వరద బాధితులను ఆదుకోవాలి

- ఇసుక మేటలు వేసిన భూమికి ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట రూరల్, జూలై 20 : పెదవాగు ప్రాజెక్టు వరదతో పంటలు, ఇళ్లు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గుమ్మడవల్లిలోని పెదవాగు ప్రాజెక్టు గండిపడిన ప్రాంతాన్ని,కట్ట మైసమ్మ వద్ద ముంపునకు గురైన పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 వేల ఎకరాలకు సాగునీరు అందించి.. ఎందరో రైతులకు బతుకునిస్తున్న ప్రాజెక్టుకు గండి పడి పంట భూములను బీళ్లుగా మార్చిందన్నారు. ఇసుక మేటలు వేసిన ఒక ఎకరానికి రూ.50 వేలు, ఇల్లు పూర్తిగా కోల్పోయిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా దెబ్బతిన్న వారికి రూ.3 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల తప్పిదం వల్లే ప్రాజెక్టుకు గండి పడిందని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలన్నారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులపై రాజకీయాలు వద్దని, ఈ వర్షాలకు రెండు ప్రాజెక్టుల్లో నీరు చేరి నిండుకుండలా ఉన్నాయన్నారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ప్రాజెక్టుకు గండిపడినా.. వారు జిల్లాను వదిలి హైదరాబాద్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. రుణమాఫీకి తెల్లకార్డు నిబంధనలు తొలగించాలని, అర్హులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, చందా లక్ష్మీనర్సయ్య, నారం రాజశేఖర్, పుట్టా సత్యం, యార్లగడ్డ శ్రీను, ఏసుబాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**రైతు** : 'డాక్టరమ్మా.. డాక్టరమ్మా.. మా ఊరి మహిళను పాము కరిచింది.. కొంచెం చూడండమ్మా..!
**డాక్టరు** : ఓపీ రాయించుకున్నారా..?
**రైతు** : లేదమ్మా..
**డాక్టరు** : ఓపీ రాయించుకుని రా.. పో.. పావుగంట తర్వాత..
**రైతు** : డాక్టరమ్మా ఓపీ రాయించుకుని వచ్చాను.. ఒక్కసారి వచ్చి చూడండమ్మా..
**డాక్టరు** : టెస్ట్‌లు చేయించుకున్నారా..?
**రైతు** : ఏ టెస్ట్ చేయించాలి..? ఎవరూ చెప్పలేదమ్మా..
**డాక్టరు** : చెప్పింది చెయ్ వెళ్లు (విసుగ్గా)..
అర్ధగంట గడిచిపోయింది.. ఒకే గదిలో కూర్చున్న ముగ్గురు డాక్టర్లు నవ్వుతూ కబుర్లు..

# ఏమిటీ నిర్లక్ష్యం!

- పాముకాటు బాధితురాలినీ పట్టించుకోలే..?
- ఖమ్మం పెద్దాసుపత్రిలో వైద్యుల అలసత్వం
- ఓపీ నమోదు.. టెస్ట్‌ల పేరుతో కాలయాపన
- క్యాజువాలిటీలో కూర్చుని నవ్వుల ముచ్చట్లు
- ప్రశ్నిస్తే బాధితురాలిని తీసుకొచ్చిన వ్యక్తిపై ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అవుతున్న వీడియో
- కాంగ్రెస్ పాలన గిట్లనే ఉంటదని జనాల సెటైర్లు



పాముకాటు బాధితురాలిని ఆసుపత్రికి తీసుకొచ్చిన వ్యక్తితో వాగ్వాదానికి దిగిన ఖమ్మం పెద్దాసుపత్రి డాక్టర్

ఖమ్మం సిటీ, జూలై 20 : ఇది సినిమా కథ కాదు.. డైలీ సీరియల్‌లో సన్నివేశం అంతకన్నా కాదు.. జిల్లా కేంద్రమైన ఖమ్మం నడిబొడ్డున సర్కారు దవాఖానలో చోటుచేసుకున్న అమానవీయ సంఘటన. ఒక మహిళ పాము కాటుకు గురై, తీవ్ర భయాందోళనతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే స్థానిక వైద్యులు వ్యవహరించిన తీరు తీవ్ర చర్చానీయాంశంగా మారింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గండికోట వెంకటమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజువారీగానే శుక్రవారం ఉదయాన్నే అదే గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన కూరగాయల చేనులో పనికి వెళ్లింది. మధ్యాహ్నం 1 గంటకు ఇంటికి బయలుదేరగా పాముకాటు వేసింది. విషయాన్ని రైతుకు తెలియజేయగా, ఆయన ఆటోలో హుటాహుటిన బాధితురాలిని ఖమ్మంలోని జిల్లా సార్వజనీన ఆసుపత్రికి తీసుకెళ్లాడు. నడిచే ఓపిక లేని ఆమెను స్ట్రెచర్‌లో కూర్చోబెట్టుకుని క్యాజువాలిటీ వార్డుకు వెళ్లాడు. ఎదురుగా ఉన్న గదిలో ముగ్గురు మహిళా వైద్యురాళ్లు కూర్చుని ఏవో మాటల్లో మునిగిపోయారు. వారి దగ్గరకు వెళ్లిన రైతు, తమ గ్రామానికి చెందిన మహిళ పాము కాటుకు గురైందని, వచ్చి చూడాలని ప్రాధేయపడ్డాడు.

### వైద్యుల తీవ్ర నిర్లక్ష్య ధోరణి

'ఏం పాము కరిచింది..? ఎక్కడ కాటు వేసింది..? ఏ ఊరు..? ఏ మండలం..? ఓపీ రాయించుకుని వచ్చారా..? అంటూ.. డాక్టర్లు కనీసం కుర్చీలో నుంచి లేవకుండా.. బాధితురాలిని పరిశీలించకుండా పేషెంట్‌ను తీసుకెళ్లిన వ్యక్తిపై ప్రశ్నల వర్షం కురిపించారు. తక్షణమే ఓపీ వార్డుకు వెళ్లగా జనం బారులు తీరి పావుగంట సమయం గడిచింది. తిరిగి క్యాజువాలిటీ వద్దకు వచ్చిన వారిని టెస్ట్‌లు చేయించుకుని రావాలంటూ మరో ఆర్డర్ వేశారు. పేషెంట్‌ను చూడకుండా టెస్ట్ ఏంటి అని అడిగితే, ఫలానా నెంబర్ గదికి వెళ్తే వాళ్లే చేస్తారు వెళ్లండి..! అంటూ ఆదేశించారు. ప్రాణభయంతో కొట్టుకుంటున్న మహిళను తీసుకుని రక్తపరీక్షల కేంద్రానికి వెళ్లి వచ్చేసరిగి మరో అర్ధగంట పట్టింది. ఇప్పుడన్నా వచ్చి చూడండి మేడం అని వైద్యులను కోరగా ఎలాంటి స్పందనా లేదు. చేతుల్లోని సెల్‌ఫోన్లను చూస్తూ ముగ్గురూ ముచ్చట్లోకి దిగారు. ఒకరిమీద మరొకరు జోకులు వేసుకుంటూ పగలబడి నవ్వుకుంటున్నరు. ఒక్కసారి రండి మేడం అని వ్యక్తి కోరగా.. ఆగవయ్యా బాబూ, ఇవన్నీ మాకు సర్వసాధారణమే, రోజూ కొన్ని వందల కేసులు చూస్తున్నామంటూ నిర్లక్ష్యపు సమాధానం.

### ప్రశ్నించిన వ్యక్తిపై ఆగ్రహం..

ప్రాధేయపడినా పాముకాటు బాధితురాలిని పట్టించుకోని వైద్యుల అలసత్వంపై వెంకటగిరి క్రాస్‌రోడ్డుకు చెందిన రైతు తీవ్ర అసహనం వ్యక్తంచేశాడు. ఇదేంటి మేడం.. మనిషి చనిపోతున్నా స్పందించరా అని ప్రశ్నించాడు. ప్రభుత్వం లక్షల్లో జీతాలు ఇస్తున్నది ప్రజలకు వైద్యసేవలు అందించడానికి కాదా..? అంటూ నిలదీశాడు. దీనికే ఆగ్రహించిన వైద్యులు.. అరుస్తున్నావ్ ఎందుకు..? మాకు తెలియదా..? ఆమెకు ఏమీ కాదులే..? అంటూ ఒక మహిళా డాక్టర్ తీరిగ్గా కుర్చీలో నుంచి లేచి పేషెంట్ దగ్గరకు వచ్చారు. నాడీ కూడా పట్టకుండానే ఇంజక్షన్ ఇవ్వండి అంటూ పక్కనే ఉన్న నర్సుకు చెప్పి తిరిగి గదిలోకి వెళ్లిపోయింది. వైద్యుల అలసత్వంతో విసిగిపోయిన ఓ వ్యక్తి అక్కడ జరుగుతున్న తీరును ఎవరికీ తెలియకుండానే వీడియో తీశాడు. అంతటితో ఆగకుండా శనివారం ఉదయాన్నే సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో సదరు వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయ్యింది. ముగ్గురు కీలక మంత్రులున్న ఖమ్మంలో నిరుపేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలాగనే మారిందని కొందరు.. కాంగ్రెస్ పాలనలో గిట్లనే ఉంటదని మరికొందరు నెటిజన్లు తిట్టి పోస్తున్నరు. నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన వైద్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా రెండురోజుల వైద్యం అనంతరం పాముకాటుకు గురైన మహిళను పెద్దాసుపత్రి వైద్యులు ఇంటికి పంపించారు.

### మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నం

జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఓపీ విపరీతంగా పెరిగింది. అయినప్పటికీ ఎంతో జాగ్రత్తగా వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం సరికాదు.

– డాక్టర్ కిరణ్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్